# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన** **డిసెంబర్ 26, 2021**

## భీమాకోరేగాం అక్రమ కేసులో అరెస్టు చేయబడిన వారినందరిని బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేయండి !!

## ప్రభుత్వ ప్రాయోజిత భీమాకోరేగాం కుట్ర కేసును ఎత్తి వేయాలి !!!

భీమాకోరేగాం చారిత్రక ప్రాముఖ్యత ప్రజలందరికి సుపరిచితమే. భీమాకోరేగాం ఘటన జరిగి 200 సంవత్సరాలు అయిన సందర్భంగా విజయోత్సవ సభ 2018 జనవరి 1న జరగడం, ఆ సభను విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ-ఆర్ఎస్ఎస్ పథకం ప్రకారం కుట్ర నడపడం కూడ ప్రజల మనస్సుల్లో ఇప్పటికీ ఉంది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులకు వ్యతిరేకంగా రోజురోజుకు సంఘటితం అవుతున్న దళితులను భయభ్రాంతులకు గురిచేయడానికి, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి బీజేపీ ప్రభుత్వం ఒక పెద్ద అణిచివేత పథకాన్ని ఆ రోజు నుండే ప్రారంభించింది. భీమాకోరేగాంలో అల్లర్లు జరపడానికి పూనేలో ఎల్గార్ పరిషత్ మీటింగ్ జరిగిందని, ఇందులో దళితనాయకులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొన్నారని, వీరికి మావోయిస్టుల సహకారం ఉందని ప్రభుత్వం తప్పుడు ఆరోపణ చేసి, ఉపా కేసును బనాయించింది. మరోవైపు మోడీ హత్య చేయడానికి అమరుడు కామ్రేడ్ మిలింద్ తేలుతుంబ్డే సూచనలతో కొంత మంది మేధావులు కుట్ర పన్నారని, వారు రాసిన లేఖలు బయట పడినాయని బూటకపు ఆరోపణలు చేసి, ఉపా కేసును బనాయించి ఈ రెండు కేసుల్లో 16 మందిని ఎన్ఐఏ అరెస్టు చేసి వీరంతా అర్బన్ నక్సల్స్ అంటూ గత నాలుగు సంవత్సరాలుగా అక్రమంగా నిర్బంధంలో ఉంచింది. జార్ఖండ్ ఆదివాసుల హక్కులకోసం నిరంతరం పోరాడిన 84 ఏళ్ళ స్టాన్‌స్వామిని కూడ ఈ కేసులో అరెస్టు చేసి, ఆయన ఆరోగ్యం విషమించినప్పటికీ, ఆయనకు బెయిల్ ఇవ్వకపోవడం, కనీసం సరియైన వైద్య సౌకర్యం కూడ కల్పించక పోవడంతో ఆయన మరణించాడు. స్టాన్‌స్వామి మరణంతో కలతతో ఆగ్రహావేశాలకు గురైన ప్రపంచ, దేశ ప్రజానీకం ఇది పచ్చి ప్రభుత్వ హత్యేనని గర్జించారు. చివరకు పార్లమెంటరీ ప్రతిపక్షాలు కూడ ఈ నిందాపూర్వకమైన ఘటనను ఖండించక తప్పలేదు. మోడీ ప్రభుత్వం, దాని పంచమాంగ దళం అయిన ఎన్ఐఏ మాత్రం ఈ ఘటనను సమర్థించుకున్నాయి.

83 ఏళ్ళ వృద్ధుడు విప్లవ రచయిత వరవరరావు నరాల వ్యాధితో, పార్కిన్‌సన్స్‌తో చావు బ్రతుకుల మధ్య ఉన్నప్పటికీ బెయిల్ మంజూరు చేయడం లేదు. తనకు అనారోగ్య పరిస్థితి రీత్యా బెయిల్ మంజూరు చేసి తన స్వంత ఇంటికీ హైదరాబాదు పంపాలనే విన్నపాన్ని కోర్టులు తిరస్కరిస్తున్నాయి. భీమాకోరేగాం కేసు విచారణ ఖైదీలకు జైలులో కనీసం అవసరమైన సౌకర్యాల కోసం పోరాడక తప్పడం లేదు. స్టాన్‌స్వామి తన చేయి తినడానికి పని చేయడం లేదని, అందుకు ఒక చెంచా కావాలనే కోరికను కోర్టుకు విన్నవించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తమ బంధువులు, తల్లిదండ్రులు మరణిస్తే కూడ పెరోల్‌కు ఎంతో కష్టపడాల్సి వస్తున్నది. ఈ కేసులో అరెస్టయిన ఒకే ఒక్కరు సుధాభరద్వాజ్‌కు డిఫాల్ట్ బెయిల్ కోర్టు ఇచ్చింది. ఈ కేసులో 8 మంది డిఫాల్ట్ బెయిల్ కోసం ముంబాయి హైకోర్టుకు పిటిషన్ వేయగా, టెక్నికల్ కారణాలను చూపెట్టి కోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ కేసులో ఎన్ఐఏ సకాలంలో కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించ లేదు. అందుకని ఈ కేసులోని వారందరికి కూడ బేషరతుగా బెయిల్ మంజూరు చేయాలి కాని న్యాయ వ్యవస్థ ప్రభుత్వ కనుసన్నలలోనే నడుస్తున్నది. ఈ వ్యవస్థలో ఎన్ఐఏ కోర్టులకే సర్వాధికారాలు. అక్రమ కేసులు మోపిన ఎన్ఐఏనే ఈ కేసుల్లో కోర్టులపై అధికారం చెలాయిస్తున్నది. స్టాన్‌స్వామి మరణం సందర్భంగా బాంబే హైకోర్టు విచారం వ్యక్తం చేసినప్పటికీ ప్రయోజనం ఏముంటుంది?

కృష్ణ అయ్యర్ తన ప్రఖ్యాత జడ్జిమెంట్‌లో నిందుతులకు 'జైలు అనేది తప్పనిసరికాదు. బెయిల్ ఒక నియమం' అని చెప్పిన విషయాన్ని కోర్టులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి బలమైన కారణాలు లేకుండానే ఏళ్ళ తరబడి బెయిల్ ఇవ్వకుండా విచారణ ఖైదీలుగా జైలులో ఉంచుతున్నాయి. మన దేశంలో న్యాయ వ్యవస్థ డబ్బున్న వాళ్ల పక్షపాతి, రాజ్య ప్రయోజనాలను కాపాడే నాలుగు స్థంభాలలో ఒక స్థంభం మాత్రమే. కాబట్టి న్యాయ వ్యవస్థ అప్పుడప్పుడు అరకొర ప్రజా వాజ్యాలకు సుముఖత వ్యక్తపరిచినప్పటికీ అంతిమంగా రాజ్య ప్రయోజనాలకు కట్టుబడి ఉంటుంది. అందుకనే భీమాకోరేగాంలో అరెస్టు అయిన వారికి కూడ న్యాయం కోర్టు ద్వారా దొరకదు. దేశ ప్రజల పోరాటం

ద్వారానే వారి హక్కులను సాధించుకోగలం.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ–ఆర్ఎస్ఎస్, ప్రభుత్వం దళితుల, ఆదివాసుల, మైనారిటీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న మేధావులు, ప్రజాస్వామికవాదులు, కవుల, రచయితలపై 'అర్బన్‌నక్సల్స్' అని ముద్రవేసి అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నది. వారిపై ఎన్ఐఏ దాడులు చేస్తున్నది. మోడీనీ హత్య చేయడానికి కుట్రపన్నాడనే నెపంతో ఆ కేసులో నెంబర్ 1గా ఇరికించిన కామ్రేడ్ మిలింద్ తేల్‌తుంబ్డేను ఎన్‌కౌంటర్ చేయడానికి పూనుకొంది. అయితే ఆ ఎన్‌కౌంటర్‌లో ఆయన ప్రభుత్వ బలగాలతో వీరోచితంగా పోరాడి 27 మంది పీఎల్‌జీఏ వీరులతో పాటు వీరమరణం పొందాడు. ఆయన సోదరుడైన ఆనంద్ తేలుతుంబ్డేను అక్రమంగా జైళ్ళో నిర్బంధించింది. భీమాకోరేగాం కేసుతో పాటు, దేశవ్యాప్తంగా హక్కులకోసం పోరాడుతున్న విద్యార్థులు, యువజనులు, కళాకారులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నది. 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్న ప్రొ. సాయిబాబకు అక్రమంగా శిక్షవేసి జైలులో నిర్బంధించి కనీసం బెయిల్ కూడ ఇవ్వడం లేదు.

బీజేపీ ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా దేశ ప్రజలు గళమెత్తుతున్నారు. భీమాకోరేగాం బాధితులతో పాటు, దేశంలో అనేక మందికి మద్దత్తుగా అంతర్జాతీయంగా సంఘీభావం లభిస్తున్నది. భీమాకోరేగాం కేసులో గల ప్రభుత్వ కుట్రను ఆర్సెనేల్‌లాబ్ బట్టబయలు చేసింది. దేశ విదేశ ప్రముఖులు ఎందరో సంతకాలు చేసి ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించడంతో పాటు, భీమాకోరేగాం కేసులో అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసారు.

ప్రియమైన ప్రజలారా!

భీమాకోరేగాం కేసులో అరెస్టు చేయబడిన వారినందరిని బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని కార్మిక, కర్షకులకు, ప్రజాస్వామిక వాదులు, కళాకారులు, రచయితలు, మేధావులు, దేశభక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాం. 'నూతన పీష్వాలు నశించాలి' అని నిరసన గళం ఎత్తాలని ప్రజలనందరిని కోరుతున్నాం.

భీమాకోరేగాం కేసును రద్దుచేసి, అక్రమంగా అరెస్టు చేసినవారినందరిని వెంటనే విడుదల చేయాలి.

☆ **ఉపా చట్టాన్ని రద్దు చేయాలి.**

☆ **ఎన్ఐఏను రద్దు చేయాలి.**

☆ **కాలం చెల్లిన దేశ ద్రోహ చట్టాన్ని రద్దు చేయాలి.**

☆ **ప్రజాస్వామిక హక్కుల కోసం జరుగుతున్న పోరాటం వర్ధిల్లాలి.**

☆ **ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.**

☆ **నూతన పీష్వాలు నశించాలి.**

**విప్లవాభివందనాలతో,**

Abhay

**అభయ్**

**కేంద్రకమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**